# "మ్యావ్" పిల్లిగాడు

వాసుదేవ్ సతీసమేతంగా భోజనం చేస్తున్నాడు. అతని అక్కయ్య చాలా అప్యాయంగా, "యింకా ఓ గంట టైమ్ ఉంది, సంతృప్తిగా భోజనం చెయి! "అంటూ కొసరి కొసరి వడ్డిస్తోంది.

"ఈ సామాన్లు తీసుకుని స్టేషన్‌కి వెళ్ళేసరికి నాపని అవుతుంది, ఎక్కువ వడ్డించకు"!

ఇంతలో పిల్లిగాడు వచ్చేశాడు "అంటూ బయట పెద్ద లొల్లి మొదలైంది.!

వాసుదేవ్ అక్కయ్య వడ్డన ఆపేసి బయటకు వెళ్ళింది. "ఏమిటి పిల్లిగాడు వచ్చేశాడు అని అరుస్తున్నారు"! అన్నాడు తన భార్యతో."

"మగ పిల్లి వచ్చింది కాబోలు! ఆడ పిల్లి అయితే 'గాడు' అనరుకదా!" అంది, వాసుభార్య,

"వచ్చిన పిల్లి ఏ 'లింగం' అని అడగడం లేదు!" అని విసుక్కున్నాడు వాసు.

ఇంతలో ఓ మూడేళ్ళ కుర్రాడ్ని చంకనేసుకుని డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి, "ఇదుగోరా తమ్ముడు! మన యింట్లో అద్దెకుంటూన్న వాళ్ళ అబ్బాయి! వీడు అన్ని జంతువులూ చేసే శబ్దాల్ని భలే అనుకరిస్తాడు! ముఖ్యంగా "మ్యావ్" అని ఏ తలుపు చాటు నుంచో వీడు అరుస్తూంటే, ఏదో పిల్లి వచ్చిందనుకుంటాం! అందుకే వీడ్ని "పిల్లిగాడు" అని ముద్దుగా పిలుస్తాం! భోజనమయిన తర్వాత ఒక్క పది నిముషాలైనా వీడి "మ్యావ్"లు విను, పరవశించి పోతావ్" అంది.

"అవును శాంతక్కయ్యా! అసలే పిల్లి దుశ్శకునం అంటారు కదా! ఈ పిల్లగాడు మా ప్రయాణం ముందు వచ్చాడేమిటి!"

"పిల్లగాడు కాదురా పిల్లిగాడు"

"బాగుంది వరస! అసలు వాడు పిల్లికే పుట్టినట్లు, నేను పిల్లగాడంటే నువు పిల్లిగాడు అంటావేమిటి!"

భోజనం తొందరగా ముగించేసి, కఠోర పిల్లి అరుపులు వినడానికి హాల్లోకి వచ్చేశారు. పిల్లిగాడు 'మ్యావ్' అంటూ అరుపులు మొదలెట్టాడు. ఇక స్టేషన్‌కి వెళ్ళడానికి అర్ధగంట వ్యవధే ఉంది.

రైలు దాటి పోతుందేమోనన్న భయం పట్టుకుంది వాసుదేవ్‌కి. స్టేషన్‌కి సమయానికి వెళ్ళగలమో లేదో అని ఏడుస్తూంటే "అచ్చు పిల్లిలాగానే అరుస్తున్నాడు కదురా తమ్ముడు" అంది శాంతక్కయ్య,

"పిల్లిలా ఏమిటి! పిల్లి బాబూలా అరుస్తూన్నాడు అంటూ, పిల్లి దుశ్శకున పాప పరిహారార్థం, ఒక వంద రూపాయలు ఆ పిల్లిగాడి చేతిలో పెట్టాడు.

"అసలు మావాడి సంగతి నీకు తెలీదు ఇంత బాగా అరుస్తూనందుకు ఓ రెండు రోజుల ముందు వచ్చి ఉంటే, వాడు మ్యావ్ అన్నప్పుడల్లా ఓ ఏబై యిచ్చేవాడు. మా వాసు" అంటూ, ఏరా తమ్ముడూ! అంది శాంత

"పోన్లే అక్కయ్యా! అసలు మేము వెళ్ళేలోపునైన వచ్చాడు! ఈ పిల్లి అరుపులు వినే అదృష్టం అసలు మాకు సంభవించింది! అన్నాడు "రైలు వెళ్ళి పోతుందేమోనన్న మనసులోని గుబులుతో"

సరే! రైలు స్టేషన్‌కి బయల్దేరారు! చిన్నప్పట్నుంచీ వాసుకి శకునాల మీద బాగా నమ్మకం!

ఆటో బయల్దేరు తూంటే, "ఆగరా"! అంటూ "చిన్న పిల్లలు దేవుడితో సమానం మీ పిల్లిగాడ్ని చంకనేసుకుని శకునం దా!" అంది శాంత ఆ పిల్లి తల్లిని! "అసలే పిల్లి దశ్శకునం! ఆ "మ్యావ్ శబ్దాలు ప్రయాణం ముందు విన్నందుకు, ప్రయాణం సజావుగా జరుగుతుందా లేదా అని ఏడుస్తూంటే, ఆ పిల్లితల్లి పిల్లిగాడ్ని చంకనేసుకుని శకునం రావడం ఒకటీ! అని

వాసు మనస్సులో బాధపడ్డాడు. ఆటో బయల్దేరుతూంటే ఆ పిల్లిగాడు "మ్యావ్" అంటూ తన చెయ్యి ఊపుతూ ఓ ఫినిషింగ్‌టచ్ యిచ్చాడు.

"ఈ పిల్లిగాడు నలుపు రంగుతో పుట్టినా బాగుండేది" అన్నాడు తన భార్యతో. "ఎందుకండీ! పిల్లాడు తెల్లగా ధగ ధగ మెరిసి పోతూంటేనూ"!

'నీ మొహం శకునాలూ, శాస్త్రాలూ అస్సలు తెలియదు నీకు "కృష్ణ మార్జాలం" మంచిందంటారు!"

"కృష్ణ అంటే కృష్ణుడు కదండీ"! అంది శోభ. తెలుగు తెలీదు, శకునాలూ, శాస్త్రాలూ ఏమీ తెలియవు నీకు!" అన్నాడు భార్యతో.

"ఏమీ తెలియకనే కదాండి. మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను" "ఈ సన్నాయి నొక్కులొకటి మాత్రం తెలుసు!" అన్నాడు వాసు

సరిగ్గా వీళ్ళు స్టేషన్ దగ్గరకి వెళ్ళేసరికి ఓ రైలు బయల్దేరి వెళ్ళిపోతోంది!

"ఒక వేళ ఆ వెళ్తున్న రైలు మనదేమోనందీ!" అంది శోభ. "నీ పేరు శోభేగాని నీవు మాట్లాడే మాటలు మాత్రం అన్నీ ఏడుపు కొట్టు మాటలే! అన్నాడు, వాసు.

శోభ చెప్పినట్లు ఆ రైలు, వాళ్ళు ఎక్కవలసిన రైలే! ఆ విషయం తెలుసుకున్న శోభ,

'నాకు వాక్శుద్ధి ఉందండీ!" అంది.

"దీన్ని వాక్శుద్ధి అనరు! అనౌచిత్యత అంటారు!" అన్నాడు వాసు. ఇంటికెళితే ఆ పిల్లిగాడు "మ్యావ్" అంటూ మళ్ళీ తగులకుంటాడన్న భయంతో, స్టేషన్ దగ్గర్లోనే ఓ లాడ్జిలో బస చేశాడు.

మర్నాడు ఉదయమే బయల్దేరే రైలు ఎక్కారు. వీళ్ళు కూర్చున్న చోటనే ఓ నలుగురు
యువకులు పేకాట ఆడుతున్నారు.

రైలు వెళ్ళి పోయిన తర్వాత కేన్సిల్ చేసిన టిక్కెట్ల వలన తక్కువ డబ్బు రావడం, లాడ్జి మింజులె అయిన ఖర్చులు, ఆ పిల్లిగాడి మ్యావ్‌లు యింకాతన చెవులలో వినిపించడంతో విసిగిపోయిన వాసూ కొంచెం ఉపశాంతి పొందడం కోసమని తన సీటులో జేర్లబడి కూర్చున్నాడు! కొంచెం నిద్ర పట్టేసింది!

ఇంతలో, మధ్యలో అట్ట జోకర్ వచ్చిన ఒక పేకాట రాయుడు తనకి అట్ట జోకర్ రావడంతో "అబ్బ! పిల్లిగాడు వచ్చాడు" అంటూ ఆట చూపించాడు. ఆ పిల్లిగాడు అనిన మాట వినిన వాసూ ఉలిక్కిపడి, వాడు రైల్లోకి ఎలా వచ్చాడో అనుకుంటూ లేచినిలబడి "ఎక్కడ! ఎక్కడ!" అని అరిచాడు.

"ఇదిగో యిక్కడ" అంటూ, "పిల్లి బొమ్మ" ఉన్న "అట్ట జోకర్" చూపించాడు. ఆ పేకాట రాయుడు.

"పేకాట ఆడని మీరు పిల్లిగాడి గురించి ఎందుకు ఉలిక్కిపడుతున్నారో అర్థం కాలేదు" అన్నారు ఆ ఆటగాళ్ళు.

"ఏం లేదు! ఆయన తత్తరపాటంతా, "మ్యావ్ పిల్లిగాడి గురించి లెండి" అంది శోభ

"ఓ అదా! అలా చెప్పండి!" అన్నారు వాళ్ళు, పెద్ద అర్థమయినట్లు!

---

(ఆంధ్రభూమి మాసపత్రిక ఫిబ్రవరి 2013)